## నవీపేట్‌లో వరుస చోరీలు : మూడు ఆలయాల్లో హుండీలు ధ్వంసం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఫిబ్రవరి 22(డీడీ9 వార్త) :** నవీపేట్ మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు బరితెగించి ఒకే రాత్రి వరుసగా మూడు ఆలయాల్లో చోరీలకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆల యం, అయ్యప్ప స్వామి గుడితో పాటు పెద్దమ్మ ఆలయాల్లోకి చొరబడిన దొంగలు హుండీలను ధ్వంసం చేసి నగదు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దుండగులు తొలుత రేణుక ఎల్లమ్మ గుడిలో హుండీ పగులగొట్టి సుమారు ?2,000 నగదును, అనంతరం అయ్యప్ప గుడిలోని హుండీ నుంచి 5,000 నగదును అపహరించారు. అక్కడితో ఆగకుండా పెద్దమ్మ ఆలయంలో ప్రవేశించి హుండీ నగదుతో పాటు అమ్మవారికి అలంకరించిన తులం బంగారం, రెండు తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు, భక్తులు హుండీలు ధ్వంసమై ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై శ్రీకాంత్ క్షేత్రస్థాయిలో ఆధారాలు సేకరించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తును వేగవంతం చేశారు. పట్టణంలో వరుస చోరీలు జరగడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ, పోలీసు గస్తీని పెంచాలని కోరుతున్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఫిబ్రవరి 22(డీడీ9 వార్త) :** బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల భద్రతా గదిని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి టి.రవి కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే అంశాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న సీళ్ళు, భద్రతా సిబ్బంది విధులను తనిఖీ చేసిన ఆయన, ప్రశ్నపత్రాల రక్షణ విషయంలో ఎటువంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు లేదా ఇతర సమస్యలు ఎదురైతే ఏమాత్రం జాప్యం చేయకుండా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాల తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యాశాఖ ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సాలూరలో ఘనంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఫిబ్రవరి 22(డీడీ9 వార్త) :** సాలూర మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందన్న రవి జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్‌ను తెప్పించి మందన్న రవితో కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి మందన్న రవి చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయన నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సాలూర గ్రామంలో పంచాయతీ వార్డు మెంబర్ సోక్కం ప్రశాంత్ వివాహ వార్షికోత్సవ వేడుకలను కూడా గ్రామస్తులు నిర్వహించారు. ప్రశాంత్ దంపతులు కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకోగా, గ్రామ ప్రజలు వారికి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అల్లే రమేష్, ఇల్తెపు రమేష్, సోక్కం రవి, కల్లూరి భాస్కర్, నీరడి నాగేష్, చిద్రపు అశోక్, కన్నె అశోక్, యువజన విభాగం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చేతన్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



**పొతంగల్, నిజామాబాద్ జిల్లా, ఫిబ్రవరి 22(డీడీ9 వార్త) :** పోతంగల్ మండల చేతన్‌నగర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్టార్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు వందలాది మంది గ్రామస్తులు తమ ఆరోగ్య సమస్యలను పరీక్షించుకున్నారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులు డాక్టర్ అఖిల్, డాక్టర్ ఇర్ఫాన్ రోగులకు బి.పి, షుగర్ వంటి సాధారణ పరీక్షలతో పాటు వివిధ రకాల సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరీక్షల అనంతరం బాధితులకు అవసరమైన ఔషధాలను స్టార్ హాస్పిటల్, వడ్ల సురేష్ హాస్పిటల్ సిబ్బంది సమన్వయంతో ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్యం అందుబాటులో లేని వారికి ఇలాంటి ఉచిత శిబిరాలు ఎంతో ప్రయోజనకరమని వైద్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామస్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి శిబిరాన్ని నిర్వహించిన వైద్య బృందాన్ని స్థానిక సర్పంచ్ కురాడే కాంత సునీల్, ఉప సర్పంచ్ గాయక్వాడ్ యాదవ్ అభినందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ప్రతినిధులు సర్పంచ్, ఉప సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సేవా కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలాజీ, జీపీ వార్డు సభ్యులు లక్ష్మణ్, హాస్పిటల్ సిబ్బంది కపిల్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పేపర్ మిల్‌లో అక్రమ ఇసుక నిల్వలు స్వాధీనం

- 26 ట్రాక్టర్ల ఇసుక సీజ్
- అడ్డుకుంటే క్రిమినల్ కేసులు తప్పవు: తహశీల్దార్ శ్రావణ్ కుమార్ హెచ్చరిక



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఫిబ్రవరి 22(డీడీ9 వార్త) :** రెంజల్ మండలంలోని పేపర్ మిల్ గ్రామంలో శనివారం తహశీల్దార్ శ్రావణ్ కుమార్ అక్రమ ఇసుక నిల్వలపై దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రామంలో రహస్యంగా నిల్వ ఉంచిన సుమారు 26 ట్రాక్టర్ల ఇసుకను అధికారులు గుర్తించి, వెంటనే వాటిని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను నిల్వ ఉంచడం, అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుక దందాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఆయన తెలిపారు. మండలం మొత్తం మీద ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తహశీల్దార్ ఈ సందర్భంగా హెచ్చరికలు జారీ చేశారు.

## ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఎక్కడ

-బీమార్మీ అసెంబ్లీ ప్రెసిడెంట్ భగత్ ప్రవీణ్



**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 22(డిడి9వార్త న్యూస్ ):-** ఆదిలాబాద్ జిల్లా సోనాల మండల కేంద్రంలో భగత్ ప్రవీణ్ ఆదివారంమాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వా రా గతంలో అనేకమైన యూనిట్లను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు కార్పొరేషన్ నిధులతో చేయూతను అందించేవారు అనితెలిపారు. ఆదిలాబాద్ జిల్లా లో ఎస్సీ కార్పొరేషన్ఉన్న ప్పటికీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా,యూనిట్లను ఏర్పాటు చేయకుండా ఎస్సీ నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని ఆయనఆరోపణలు చేశారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరి చి కార్పొరేషన్ నిధులను మంజూరు చేయాలని, దాని తోపాటు'రాజీవ్ యువవికాసం పేరుతో నిరుద్యోగ యువతను ఆదుకుంటామని దరఖాస్తులు స్వీకరించి ఇప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టు ప్రభుత్వంనిద్రమత్తులో ఉందన్నారు. వెంటనే కార్పొరేషన్ నిధులు,రాజీవ్ వికాసం పథకాలను అమలు చేయాలని భీమ్ ఆర్మీఅసెంబ్లీ ప్రెసిడెంట్ భగత్ ప్రవీణ్ డిమాండ్ చేశారు

## ఆడపిల్ల పెళ్లికి అండగా అన్నగా నిలుస్తున్న సిరికొండ సర్పంచ్: బొడ్డు.దత్తాద్రి

- సిరికొండ ఆడబిడ్డలకు ఆర్థిక సాయంగా ఐదువేల రూపాయలు అందజేత
- కక్ష సాధింపులు చర్యలు లేని సుపరిపాలన



**సిరికొండ 22 ఫిబ్రవరి (డిడి9 వార్త న్యూస్):** సిరికొండ మండల కేంద్రంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో విజయం సాధించిన, బొడ్డు.దత్తు సర్పంచులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తాను ఎన్నికల సమయంలో సిరికొండలో ఉన్న ఆడపిల్లల పెళ్లిలలో ఐదువేల రూపాయలకు ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చి ఆడపిల్ల వివాహ సమయంలో అన్నగా అండగా నిలుస్తున్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమము చేపట్టడం చాలా ఆనందంగా ఉందని ఆడబిడ్డ ఉన్నా తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యువ నాయకున్ని సర్పంచిగా ఎన్నుకోవడం వలన తనదైన శైలిలో పరిపాలన జరిగిస్తున్నారు ఆడబిడ్డల యొక్క తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోడ్డు దత్తు మాట్లాడుతూ సిరికొండ గ్రామపంచాయతీలో ఏ ఆడబిడ్డ వివాహము జరిగిన తన వంతుగా ఆర్థిక సహాయం గా ఐదు వేల రూపాయలను ఇప్పటివరకు మూడు కుటుంబాలలో అందించడం జరిగిందని, ఇక ముందు కూడా ఇది కొనసాగుతుందని, అలాగే ప్రజా ప్రభుత్వం -కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని, అభివృద్ధి లోనూ సిరికొండ గ్రామపంచాయతీని ఆదర్శంగా నిలుపుతామని, ఎవరిపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని అందరితో కలిసి అభివృద్ధి కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్. ఇమామ్, అదిలాబాద్ జిల్లా ముదిరాజ్ యువజన అధ్యక్షులు కంచం. లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సిరికొండ మైనార్టీ చైర్మన్ షేక్. రంజాన్, సిరికొండ శివాలయ కమిటీ అధ్యక్షులు శివశంకర్, మరియు వార్డు మేంబర్లు సందీప్,రామారావు, కొండాపూర్ రాం పూర్ సర్పంచులు ఉప-సర్పంచ్ లు నాయకులు గజా నంద్,సత్య, శ్రీహరి గౌడ్,గురుమూర్తి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కళాబృందం ద్వారా సైబర్ భద్రతపై చైతన్యం






**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 22(డిడి9 వార్త):** ఎల్లారెడ్డి పట్టణంలోని వి.కె.వి ఫంక్షన్ హాల్‌లో వేసవి కాలంలో జరిగే దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ బి. మహేష్ సూచనలతో పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా కళాబృందం ఇన్‌చార్జ్ రామంచ తిరుపతి హెడ్ కానిస్టేబుల్, పీసీ సాయిలు పాటలు, మాటల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 కు డయల్ చేయాలని సూచించారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తాళాలు వెంట తీసుకెళ్లాలని, అవసరమైతే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి షీ టీమ్స్ సభ్యులు, పీసీ కె. శ్రీశైలం, డబ్ల్యూపీసీ సుప్రజ, బ్లూ కోట్స్ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు




**నిజామాబాద్ జిల్లా, ఫిబ్రవరి 22(డీడీ9 వార్త) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే.సూర్యం తీవ్రంగా విమర్శించారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్మిక శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. అదేవిధంగా కేంద్రంలోని మోడీ సర్కార్ లేబర్ కోడ్ల పేరుతో దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను నీరుగార్చుతోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా ప్రభుత్వాలు చట్టాలను సవరిస్తున్నాయని, దీనివల్ల శ్రమజీవుల బతుకులు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిరంకుశ పోకడలను అడ్డుకోవడానికి, తమ న్యాయబద్ధమైన హక్కులను సాధించుకోవడానికి కార్మికులందరూ సంఘటితంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కార్మిక సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి కార్మిక సంఘాల నాయకులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

